ప్రజాశక్తి
సోమవారం 21, నవంబర్ 2022
5
శ్రీ సత్యసాయి

విద్యార్థులతో పనులు చేయిస్తే చర్యలు
ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - చిలమత్తూరు

విద్యార్థులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మహాత్మ జ్యోతి రావ్ పూలే పాఠశాల, కళాశాలల జిల్లా కన్వీనర్ ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని టేకులోడు గురుకుల పాఠశాల విద్యార్థులతో పనులు చేయిస్తున్న వైనంపై ప్రజాశక్తి దినపత్రికలో శనివారం ప్రచురితమన కథనానికి మహాత్మ జ్యోతి రావ్ పూలే పాఠశాల, కళాశాలల జిల్లా కన్వీనర్ ప్రసాద్ స్పందించారు. ఈ మేరకు ఆయన ఆదివారం టేకులోడు గురుకుల పాఠశాలను సందర్శించి ప్రిన్సిపల్ కరుణజ్యోతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొదటి తప్పుగా భావించి వదిలేస్తున్నామని ఇంకోసారి ఇలాంటివి పునారావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సెమినార్‌లో మాట్లాడుతున్న ఇండియన్ సైక్రియాస్టిక్ సొసైటీ అధ్యక్షులు ఎండ్లూరి ప్రభాకర్

మానసిక పరిశుభ్రతతో జీవితానికి శ్రేయస్సు

ఇండియన్ సైక్రియాస్టిక్ సొసైటీ అధ్యక్షులు ఎండ్లూరి ప్రభాకర్

సెమినార్‌కి హాజరైన విద్యార్థినులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మానసిక పరిశుభ్రత పాటించి మంచి జీవితానికి మార్గం వేసుకోవాలని ఇండియన్ సైక్రియాస్టిక్ సొసైటీ సౌత్‌జోన్ అధ్యక్షులు డాక్టర్ ఉదయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, ఇండియన్ సైక్రియాస్టిక్ సొసైటీ ఆధ్వర్యంలో కెఎస్‌ఎన్ కళాశాలలో మానసిక ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ఇండియన్ సైక్రియాస్టిక్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు ఎండ్లూరి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో అతి చిన్న పిల్లల నుంచి ముసలి వయస్సు వారి వరకు అనేక మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని తెలిపారు. శారీరక ఆరోగ్యానికి ఇచ్చే ప్రాధాన్యత మానసిక ఆరోగ్యానికి ఇవ్వకపోవడమే కారణం అన్నారు. టెక్నాలజి అభివృద్ధి చెందిన నేపథ్యంలో మంచి కోసం విజ్ఞానాన్ని వినియోగించడం వల్ల సమాజానికి మంచి జరుగుతుందన్నారు. అలాకాదని చెడు కోసం వినియోగించడంతో వారితో పాటు చుట్టూ ఉన్న సమాజానికి కూడా చెడు తలపించే ప్రమాదం ఉందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, ఆరోగ్యంగా జీవించడం మానసిక పరిశుభ్రత పాటించడంతోనే సాధ్యమవుతుందన్నారు. ఒక సమస్య నుంచి బయట పడటానికి మరొక సమస్యల్లో కూరుకుపోతూ, సమస్యను ఎవరికీ చెప్పుకోలేని నైరాశ్యంలోకి వెళ్లిపోతున్నారని తెలిపారు. దీనివల్ల ఆత్మహత్యలు వంటివి చోటు చేసుకుంటున్నాయన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండేదని, సమస్యలు వచ్చినప్పుడు ఒకరినొకరు చెప్పుకునే వారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అసాధారణ పద్ధతులను ఒత్తిడి నియంత్రణకు ఉపయోగించడం వల్ల చిన్న వయస్సులోనే దీర్ఘకాలిక జబ్బులకు గురవుతూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సమాజంలో జరుగుతున్న ఆత్మహత్యలు, డ్రగ్స్ అలవాటు, మొబైల్ గేమ్స్, లోన్‌యాప్స్, చిన్న వయస్సులోనే ప్రేమ వివాహాలు చేసుకోవడం, కుటుంబ కలహాలతో చేసే వృత్తిపై ప్రభావం పడటం, మన శరీరాన్ని యాంత్రికంగా జీవిస్తున్నామన్న విషయాన్ని గమనించకపోవడం వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వీటన్నింటిని నియంత్రించేందుకు యాంత్రిక జీవితాన్ని వీడి మానసిక పరిశుభ్రత పాటిస్తూ మంచి జీవితాన్ని గడపాలని సూచించారు. పిల్లలకు సమస్యలు వచ్చినప్పుడు తల్లి తండ్రులకు స్వేచ్ఛగా చెప్పుకునే వాతావరణాన్ని ఇంట్లో పెంపొందించుకోవాలని సూచించారు. ఇండియన్ సైక్రియాస్టిక్ సొసైటీ సౌత్‌జోన్ అధ్యక్షులు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదువుకుని తల్లి తండ్రుల ఆశయాలను నెరవేర్చుకోవాలన్నారు. కెఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంకరయ్య మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై మరిన్ని సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థుల ఎదుగుదలకు తోడ్పాటు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర యాదవ్, నాయకులు రిషి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఈ-నామ్..బద్నామ్..!

హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారులు, కమిషన్ ఏజెంట్‌లు ఒక్కటయి యార్డుకు వచ్చే రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అరికట్టాల్సిన అధికారులు వారితో కలిసిపోయి పరోక్షంగా సహరిస్తుండడంతో రైతు దగా పడుతున్నాడు. ఇది చాలదన్నట్లు ఈ-నామ్ విధానంలో వ్యాపారాలు జరగాల్సి ఉన్నా బహిరంగ వేలం ద్వారా వాపారం చేస్తున్నారు. ధరను, సరుకును తక్కువ చూపించి ప్రభుత్వానికి తక్కువ కమిషన్‌ను చెల్లిస్తున్నారు. ఈ విషయాలన్నీ తెలిసినా ఏమీ పట్టనట్లు స్థానిక అధికారులు వ్యవహరిస్తుండడం గమనార్హం.

ఒక్కటై రైతులను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న మార్కెట్ అధికారులు

బహిరంగ వేలంలో వ్యాపారం ధర, సరుకు తగ్గించి ఈ-నామ్‌లో నమోదు

ప్రజాశక్తి-హిందూపురం

రైతులకు గిట్టుబాటు ధర కల్పించి న్యాయం చేయాలని, వ్యాపారాలను చట్టబద్ధత చేసేందుకు ప్రభుత్వం అనంతపురం, హిందూపురం, కళ్యాణదుర్గం మార్కెట్ యార్డుల్లో ఈ-నామ్ విధానాన్ని అమలుచేసింది. ఈ-నామ్ అమలు జరిగితే తమ ఆటలు సాగవని తెలిసి వ్యాపారులు ధరలను ఆమాంతం తగ్గించి రైతులను రెచ్చగొట్టి కార్యాలయం ఎదుట ఆందోళన చేయిస్తున్నారు. అధికారులు సైతం ఈ-నామ్‌కు గండికొట్టడానికి వ్యాపారులకు సహకరిస్తూ మార్కెట్‌లో మాయ చేస్తున్నారు.

మాది రైతు ప్రభుత్వం..రైతుల సంక్షేమమే లక్ష్యం అంటూ స్థానిక వార్డు మెంబర్ నుంచి ముఖ్యమంత్రి వరకు ఉపన్యాసాలు ఊదరగొడుతున్నా.. అధికారులు మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు బాగుంటేనే ముడుపు అందుతాయన్న విధంగా హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు వ్యవహరిస్తున్నారన్నది అక్షర సత్యం. ఈ-నామ్ అమలుకు అన్ని సౌకర్యాలు, సిబ్బంది ఉన్నప్పటికి అమలు చేయడం లేదు. దీనికి వ్యతిరేంగా ఈ-నామ్ సిబ్బంది మాట్లాడితే వారిపైనే ఆగ్రహం వ్యక్తం చేస్తూ సుపర్‌వైజర్లు అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పై అధికారులు ఈ-నామ్‌ను తప్పని సరిగా అమలుచేయాలని ఒత్తిడి తెస్తే..వ్యాపారులకు చెప్పి ధరలను అమంతంగా తగ్గిస్తున్నారు. ఈ-నామ్‌లో ఆధరలను నమోదు చేస్తారు. రైతులను రెచ్చగొట్టి ఈ-నామ్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేయిస్తున్నారు.

రైతులను మాయచేసి మోసం..

ఈ-నామ్ విధానం ద్వారా వ్యాపారులు లావాదేవీలు జరిపితే తప్పనిసరిగా ప్రతిపైసాకు ప్రభుత్వానికి లెక్కచూపించాల్సి ఉంటుంది.

ధర నిర్ణయించి చీటీ రాసి ఉంచిన దృశ్యం

బహిరంగ వేలం ద్వారా మిర్చిని కొనుగోలుచేసే వ్యాపారులు 20 నుంచి 30 శాతం లెక్కలు చూపించి మిగిలినది జీరో బిజినెస్‌గా చూపిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 20 కేజీల తూకానికి ఒక కేజీ తూకం అదనంగా తీసుకుంటున్నారు. దీంతో పాటు మార్కెట్ నిబంధనల మేరకు రూ.100లకు 2 శాతం కమీషన్ ఉంటే ఇక్కడ మాత్రం 4 శాతం తీసుకుంటున్నారు. వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు రైతులకు అప్పు ఇచ్చివుంటే ఒక శాతం పెంచి ఐదు శాతం తీసుకుంటున్నారు. మొత్తానికి హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో రైతులను మాయచేసి మోసం చేస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

మార్కెట్ యార్డులో మిర్చికి బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్న కమిషన్ ఏజెంట్

అవగాహన కల్పించడంలో విఫలం

ఈ-నామ్ విధానంపై అధికారులు రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే ఈ-నామ్ అమల్లోకి వచ్చి నాలుగేళ్ళు పూర్తి అవుతున్నా దీనిపై రైతులకు అధికారులు అవగాహన కల్పించలేక పోయారు. దీంతో వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు ఏమి చెపితే దానికి రైతులు ఊకొడుతూ వారికి వారే మోసం చేసుకుంటున్నారు.

సిబ్బంది ఉన్నా అమలుకావడం లేదు..

ఈ-నామ్ అమలుకు హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రత్యేక కంప్యూటర్లతో పాటు సిబ్బంది కూడా ఉన్నారు. వారు విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నా మార్కెట్‌లో పనిచేసే అధికారులు కొందరు అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ-నామ్ పూర్తి స్థాయిలో అమలు జరిగితే మార్కెట్ అధికారులకు వచ్చే మాముళ్లు అందవు. దీంతో ఇది అమలుకాకుండా చూస్తున్నారన్న చర్చనడుస్తోంది.

కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులదే శాసనం..

హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో అనాదిగా కొంతమంది మాత్రమే వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్స్ పొందివున్నారు. వారు చెప్పిందే మార్కెట్‌లో వేదం. ఇక్కడ కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు కలిసి శాసిస్తే దాన్ని అధికారులు తూచా తప్పకుండా పాటించాల్సిందే. దీనికి తోడు గ్రామాలకు వెళ్లి రైతులకు కొంత మొత్తం అడ్వాన్సుగా చెల్లిస్తున్నారు. దీంతో పండించిన సరుకును రైతులు వారివద్దకే తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఈ-నామ్ విధానం వల్ల ధరలు తగ్గిపోతాయని దీనికి వ్యతిరేకంగా ఆందోళన చేయాలని రైతులను రెచ్చగొడుతున్నట్లు సమాచారం. ప్రత్యక్షంగా, పరోక్షంగా కొందరు అధికారులు సహకరిస్తున్నట్లు ఆశాఖ సిబ్బందే చెబుతున్నారు.

గిట్టుబాటు ధర వస్తే చాలంటున్న రైతులు

'ఈ-నామ్ అయినా, బహిరంగ వేలం అయినా.. ఏ పద్ధతిలో వ్యాపారాలు చేసినా మాకు అభ్యంతరం లేదు. పంటకు గిట్టుబాటు ధర ఇస్తే చాలు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకొస్తే వ్యాపారులు, ఏజెంట్లు ఒక్కటై మోసం చేస్తున్నారు. ధరలు ఆమాంతం తగ్గాయని, సరుకు అమ్ముడుపోలేదని మభ్యపెడుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రావడంలేదు'.. అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సత్యసాయి బోధనలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్యసాయి బోధనలు సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే పేర్కొన్నారు. బాబా జయంతి ఉత్సవాల సందర్భంగా సాయి కుల్వంత్ హాలు లో బాబా బోధనలు - నారాయణ సేవ గురించి ఆయన ఆదివారం ప్రసంగించారు. నారాయణ సేవలు వల్ల గ్రామీణ ప్రజలకు తగిన సేవలు అందించిన వారమని బాబా చెప్పేవారన్నారు. సత్య సాయి సేవా సమితుల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా విద్య, వైద్య, తాగునీరు తదితర ఎన్నో సేవా కార్యక్రమాలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయన్నారు. మానవసేవయే మాధవసేవ అనే సూక్తిని అనుసరించి సాటి మనుషులకు తమ శక్తి కొద్దీ సాయం చేయాలన్నారు. సాయంత్రం సంగీత కచేరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చంద్రబాబు మూడు రాజధానులకు వ్యతిరేకి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి. పుట్టపర్తి అర్బన్

స్వార్థ ప్రయోజనాలు వ్యక్తిగత లబ్ధి కోసమే మూడు రాజధానులను చంద్రబాబు వ్యతిరేకిస్తున్నారని స్థానిక శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి విమర్శించారు. వైసీపీ స్థానిక కార్యాలయంలో ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన బాబు, కర్నూలు జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి జగన్‌ను. పోలీసులను దూషించడం సరికాదన్నారు. ఆనాడే వికేంద్రీకరణ జరిగి ఉంటే ఏపీ విడిపోయేదే కాదన్నారు. మూడు రాజధానుల ఏర్పాటుతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని భావించి జగన్ ఈ నిర్ణయం తీసుకొన్నాడన్నారు. అమరావతిలో భూములు కొన్నందునే అక్కడే రాజధాని కావాలని బాబు రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. 2024 ఎన్నికలలో మూడు రాజధానులపైనే రెపరెండంగా తీసుకొనుటకు తాము సిద్ధమని ఇందుకు చంద్రబాబు సిద్ధమేనా అని సవాలు విసిరారు. రాయలసీమ వాసిగా చంద్రబాబు కర్నూలులో న్యాయ రాజధానిని వ్యతిరేకించడం వల్ల సీమ ద్రోహిగా నిలుస్తాడన్నారు. శ్రీ బాగ్ వడంబడిక అమలు చేయాల్సిందేనని వికేంద్రీకరణకు ప్రజలంతా మద్దతు తెలుపుతున్నారని అన్నారు. సత్యసాయి జయంతి వేడుకలకు ప్రభుత్వపరంగా అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కూడా కేటాయించామన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ పట్టణ గ్రామీణ కన్వీనర్లు రంగారెడ్డి, నర్సారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్మన్ శ్రీ లక్ష్మీ నారాయణ రెడ్డి, గంగాద్రి, మాధవప్ప తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

'ఉన్నత విద్య' ప్రమాణాలు పెంచుతున్నాం

విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధికి కృషి
'ప్రజాశక్తి'తో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'ఉన్నత విద్యలో అత్యుత్తమమైన ప్రమాణాలను తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.. ఆ దిశగా మార్పులను తీసుకొస్తోంది'.. అని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసరు కె.హేమచంద్రారెడ్డి 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు. అనంతపురం జెఎన్‌టియులో జరిగిన ఒక సమావేశంలో పాల్గొనేందుకు ఆయన అనంతపురం విచ్చేసిన సందర్భంగా 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఉన్నత విద్యలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు, అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

ప్రశ్న : ఉన్నత విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులేమిటీ ?

చైర్మన్ : ఉన్నత విద్యాభివృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. సమూలమైన మార్పులు తీసుకొచ్చే దిశగా అనేక చర్యలు ఇప్పటికే చేపట్టింది. విద్యా విధానంలో గతంలో లాగా చదువు ఒక్కటే కాకుండా ఇంటర్నుషిప్ విధానాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా డిగ్రీ చదివే విద్యార్థికి చదువు ఒక్కటే కాకుండా ప్రాక్టికల్‌గా తెలుసుకునే అవకాశాలు కలుగుతాయి. ఇది విద్య పూర్తయిన తరువాత తాము ఏమి చేయాలన్న ఆలోచన ఆ విద్యార్థుల్లో కలుగుతుంది. ప్రతి విద్యార్థీ తరగతికి హాజరై ప్రత్యక్షంగా విద్యను అభ్యసించాలన్న ఉద్దేశంతో వచ్చే నెల నుంచి ఫేసియల్ రికగ్నైజేషన్ అటెండెన్సును రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతోంది. ఇప్పటి వరకు అక్కడక్కడ విద్యార్థులు తరగతులకు హాజరవకుండానే పరీక్షలు రాసే పరిస్థితులూ ఉన్నాయి. ఈ విధానం ద్వారా కొంతవరకు మెరుగు పడేందుకు అవకాశముంటుంది.

ప్రశ్న : బోధనా ఖాళీలు పెద్దఎత్తున ఉన్నాయి..ఇవి భర్తీ కాకుండా ఉన్నత విద్య పూర్తి స్థాయిలో ఏ రకంగా అందుతుంది ?

చైర్మన్ : బోధనా సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. గడిచిన 15 ఏళ్లగా భర్తీలు పూర్తి స్థాయిలో జరగలేదు. దీంతో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2019 లోనే వీటిని భర్తీ చేసే ప్రక్రియను ప్రారంభించింది. సుమారు రెండు వేల పోస్టులైనా భర్తీ చేసేందుకు సిద్ధపడింది. అయితే కొంతమంది న్యాయస్థానాలకు వెళ్లడంతో న్యాయపరమైన చిక్కులొచ్చాయి. వాటిని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి భర్తీ చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వముంది. అప్పటి వరకు కాంట్రాక్టు పద్ధతిలో సిబ్బందిని నియమించుకుని ఇబ్బంది కలుగకుండా చేసే ప్రయత్నం చేస్తున్నాం. కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలను కొంతవరకు పెంచాం.

ప్రశ్న : ప్రయివేటు విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలు సరైన విద్యా ప్రమాణాలు పాటించడం లేదు..వీటి కట్టడికి తీసుకుంటున్న చర్యలేమిటీ ?

చైర్మన్ : ప్రయివేటు విశ్వవిద్యాలయాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు మానిటర్ చేసే విధంగా ప్రత్యేకంగా మానిటరింగు కమిషన్ వేశాం. ఇక ప్రయివేటు విద్యా సంస్థలు ప్రమాణాలు పాటించడంపై ప్యాక్టు ఫైండింగు కమిటీలను వేయడం జరుగుతోంది. ఇందులో వచ్చిన నివేదికల ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు ఆ విధంగా 57 కళాశాలలపై చర్యలు తీసుకున్నాం. సుమారు 340 కోర్సులు ఆయా కళాశాలల్లో వాటిని రద్దు చేశాం. సీట్ల సంఖ్యను ఇది వరకటికంటే 60 వేలు తగ్గించాం. గతంలో 6 లక్షల సీట్లు ఉండేవి. ప్రస్తుతం వాటిని 5.40 లక్షలకు తీసుకొచ్చాం. ప్రధానంగా ఇంటర్మీడియల్ చదువు పూర్తి చేసుకుని ఏడాదికి వస్తున్న వారు 3.50 లక్షలు ఉన్నారు. సీట్లు ఏకంగా 5.40 లక్షలు ఉన్నాయి. ఇంత పెద్ద వ్యత్యాసం ఉండటంతో విద్యార్థులు ఆసక్తి చూపని కళాశాలల్లో సరైన విద్య ఉండటం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు సరిగా లేని, బోధన సరిగాలేని కళాశాలలపై చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : ఏటా ఎన్ని సీట్లు ఖాళీగా ఉంటున్నాయి.. వీటిని సద్వినియోగం చేసుకునే విధంగా దిగువ స్థాయి నుంచి తీసుకుంటున్న చర్యలేమైనా ఉన్నాయా ?

చైర్మన్ : అవును దీన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జిఇఆర్) పెరిగింది. బడికి వస్తున్న విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఇది పది, ఇంటర్మీడియట్‌లోనూ కనిపిస్తోంది. ఇది పెరగడం ద్వారా డిగ్రీ చేరే వారి సంఖ్య కూడా పెరగనుంది. వచ్చే రెండు, మూడేళ్లలో డిగ్రీ వరకు చదివే వారి సంఖ్య ఏడు లక్షల వరకు చేరుతుందన్నది ప్రభుత్వ అంచనా.

'ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లోకి '

ప్రజాశక్తి-హిందూపురం

ఇప్పటి నుంచి తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఇటీవల హత్యకు గురైన రామకృష్ణారెడ్డి అక్క మధుమతిరెడ్డి ప్రకటించారు. ఆదివారం మండలంలోని బాలంపల్లి గ్రామంలో చౌళూరు రామకృష్ణారెడ్డి సంతాప సభను వైసిపి నాయకుల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణారెడ్డి అక్క మధుమతి రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం ఈ సభతో తన రాజకీయ ప్రస్థానం మొదలవుతుందన్నారు. పార్టీలో ఎన్ని గ్రూపులున్నా వాటికి త్వరలోనే చెక్ పెడతానని, అధిష్టానం నుంచి పూర్తి స్థాయిలో మద్దతు తనకు ఉందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. 15 సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేసిన తన తమ్ముడికి ప్రజల మీద ఇంత మమకారం ఉందని ఏనాడు ఊహించలేదన్నారు. రామకృష్ణారెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానని చెప్పారు. 2024 అసెంబ్లీ ఎన్నికలల్లో హిందూపురంలో తెలుగుదేశం పార్టీ కంచుకోటను బద్దలు కొట్టి వైసిపి జెండా ఎగరవేయడమే తన ముఖ్య ఉద్దేశమన్నారు. 2024 ఎన్నికలల్లో అధిష్టానం శాసనసభ ఎన్నికలకు సంబంధించి అవకాశం కల్పిస్తే ఖచ్చితంగా పోటీ చేసి గెలుపు దిశగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మధుమతి కుటుంబ సభ్యులు నాగభూషణ్ రెడ్డి, లోకేష్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జనార్దన్ రెడ్డి, హిందూపురం మున్సిపల్ కౌన్సిలర్లు శివ, ఆసిఫ్, చంద్ర, మండల కన్వీనర్ నక్కలపల్లి శ్రీరామ రెడ్డి, రామ్మూర్తి, తిమ్మారెడ్డి, బాలంపల్లి ఓబుల్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మధుమతి రెడ్డి

పాఠశాల ముందు పెరిగిన పిచ్చిమొక్కలు

అపరిశుభ్రతకు కేరాఫ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నంబుల పూలకుంట : మండల కేంద్రంలోనిజిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల అపరిశుభ్రతకు కేరాఫ్‌గా నిలచింది. పాఠశాలలో దాదాపు 600 మంది విద్యార్థులున్నారు. పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు, కంప చెట్లు పెరిగిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో విషసర్పాలు సంచరిస్తున్నాయి. పాఠశాల ఆవరణాన్ని శుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు..

ముమ్మరంగా ఓటరు నమోదు

మడకశిర రూరల్ : మండలంలోని జమ్మానిపల్లిలోని ఎంపియుపి పాఠశాల వద్ద ఆదివారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎల్ఓ కీరావాణి మాట్లాడుతూ 18సంవత్సరాల వయస్సు నిండిన యువతి యువకులు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మురళిశేషప్ప, రంగప్ప, సురేష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

సల్మాకు డాక్టరేట్

ఓబుల దేవర చెరువు : మండలంలోని పేద కుటుంబానికి చెందిన సల్మాకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. స్టడీస్ ఆన్ స్ట్రక్చర్ల్ అండ్ ల్యూమినో ప్రాపర్టీస్ ఆఫ్ ట్రావెలెంట్ రేర్ ఎర్త్ డోప్డ్ బ్లెండ్ పాలిమర్ ఫిలిమ్స్ అంశంపై డాక్టర్ హేమలత పర్యవేక్షణలో పరిశోదన చేసిన సల్మాకు ఎస్వీ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది.

కనకదాస జయంతి వేడుకలు

లేపాక్షి : మండలంలోని బి సలమానేపల్లి పంచాయతీలో కురుబ సోదరుల ఆధ్వర్యంలో ఆదివారం కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కనకదాసు చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కురుబ సోదరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహ సౌకర్యం

బుక్కపట్నం : అర్హులందరికీ పక్కాగృహాలు మంజూరు చేస్తామని హౌసింగ్ పీడీ నాగరాజు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని గూనిపల్లిలో ఆవాస్ దివాస్ కింద ప్రభుత్వం చేపడుతున్న గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, సర్పంచి భాస్కర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల శతజయంతి వేడుకలు

తనకల్లు : మండల పరిధిలోని బాల సముద్రంలో ఉన్న జంబులింగేశ్వర స్వామి శివాలయంలో ఘంటసాల శతజయంతి ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. కె. రెడ్డప్ప, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా పాటల కచేరీ నిర్వహించారు. తిరుపతి, నెల్లూరు, అనంతపురం, చింతామణి నుండివచ్చిన గాయకులు ఘంటసాల పాటలు పాడారు. ఈసందర్భంగా గాయకులను కె.రెడ్డప్ప ఆయన సతీమణి వెంకటరమణమ్మను, ఆరుద్ర శ్రీనివాసులును ఆలయ కమిటీ సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షురాలు లక్ష్మీ నారాయణమ్మ, బుగుడే చంద్ర, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

బత్తలపల్లి : బత్తలపల్లి మండలంలో వివిధ గ్రామాల్లోని బాధితులను మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. చెన్నపట్నం గ్రామానికి చెందిన కట్టుబడి సత్యనారాయణ ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి పదివేల రూపాయలను అందజేశారు. అలాగే అప్రా చెరువు గ్రామానికి చెందిన ముసుగు గురుస్వామి ప్రమాదవశాత్తు మృతిచెందిన నేపథ్యంలో అతని కుటుంబసభ్యులను పరామర్శించి పదివేల రూపాయలు అందజేశారు. అదే గ్రామానికి చెందిన కోడారుపల్లి రామకృష్ణ గుండెపోటుతో మృతిచెందిన నేపథ్యంలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఇలా పలు గ్రామాల్లోని బాధితులను పరామర్శించిన గోనుగుంట్ల సూర్యనారాయణ వారికి ఆర్థికసాయం అందజేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కొత్తపేట బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 2003-04 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఒక్క చోట కలిశారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు కలిసిమెలిసి ఆనందంగా గడిపారు. నాటి గురువులను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం నాటి గురువులు వెంకటప్ప, పద్మావతి, రామకృష్ణ, రాంప్రసాద్, శోభ, రత్నమ్మ, పెద్దారెడ్డిని పూర్వపు విద్యార్థులు సన్మానించారు. పూర్వవిద్యార్థులందరూ కలిసి రూ.3లక్షల విలువ చేసే డ్రైనింగ్ హాల్‌ను పాఠశాల ఆవరణంలో ఏర్పాటుచేయడంపై పలువురు అభినందించారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం

బత్తలపల్లి : బత్తలపల్లిలోని వడ్డెర కాలనీలో గల పెద్దకోట్ల పెద్దమ్మకు ఆదివారం రాత్రి జ్యోతుల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తాడిమర్రి మండల పెద్దకోట్ల గ్రామంలోని పెద్దమ్మ దేవతలకు ప్రతి యేటా కార్తీక మాసంలో ఆ స్వామికాపులు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కారణంగా పెద్దకోట్ల గ్రామం ముంపునకు గురికావడంతో గ్రామానికి చెందిన వందలాది కుటుంబాలు బత్తలపల్లికి వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. అదేవిధంగా వడ్డెర కాలనీలో పెద్దమ్మ, సుంకులమ్మ దేవాలయాలను నిర్మించుకుని వేడుకలను ప్రతియేటా వైభవంగా నిర్వహించుకుంటున్నారు.

ఐక్యతా సమావేశాన్ని జయప్రదం చేయండి

చిలమత్తూరు : ఈ నెల 27 న పుట్టపర్తి లో జరుగు కురుబల ఐక్యగా సమావేశాన్ని జయప్రదం చేయాలని కురుబ సంఘం జిల్లా నాయకులు కోరారు.కనకదాసు జయంతి సందర్భంగా దేమకేతేపల్లి పంచాయతీ కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తిరుమలేష్, నాయకులు బాలాజీ, చలపతి, నారాయణప్ప, సోమశేఖర్, రామలింగప్ప పాల్గొన్నారు.

సత్య సాయి డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ

పెనుకొండ : సెప్టెంబర్ 22న రాష్ట్ర స్థాయి డిగ్రీ కళాశాలలు విభాగం- నా జీవిత లక్ష్యం, తద్వారా దేశాభివద్ధి, అను అంశంపై వ్యాసరచన పోటీల్లో పెనుకొండలోని శ్రీసత్య సాయి డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ కనపర్చింది. థర్డ్ బీఎస్సీ కి చెందిన విద్యార్థి సాయి దర్శన్ శ్రీసత్యసాయి జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించింది. దీంతో ఈ నెల 19న పుట్టపర్తిలో సాయి సెంట్రల్ మేనేజింగ్ ఆర్గనైజేషన్ ట్రస్టీ రత్నాకర్ చేతుల మీదుగా జ్ఞాపికకు అందుకుంది.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకారం

కదిరి టౌన్ : రెడ్డి కమ్యూనిటీ భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కదిరి రూరల్ మండలం కాలసముద్రం సమీపాన వద్ద కదిరి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వనభోజన మహోత్సవంలో ఎమ్మెల్యేతో పాటు సిఇసి సభ్యులు పూల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండే విధంగా కళ్యాణ మండపం నిర్మించేందుకు అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కదిరి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నాగూరి రామచంద్రారెడ్డి,కమిటీ సభ్యులు, కదిరి మరియు పుట్టపర్తి నియోజకవర్గం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సభ్యులు పాల్గొన్నారు.

అనుమతులు లేని వైద్యం

లేపాక్షిలో ఆర్ఎంపిలు ఏర్పాటు చేసిన క్లీనిక్‌లు

ప్రజాశక్తి- లేపాక్షి

లేపాక్షిలో ఎలాంటి అనుమతులు లేకుండానే క్లీనిక్‌లు ఇబ్బడి ముబ్బడిగా వెలిసాయి. ఆర్ఎంపిలమని చెప్పుకుంటున్న కొందరు వచ్చిరాని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వైద్యంపై కనీస అవగాహన లేకపోయినా సరికొత్త హంగులతో క్లీనిక్ అంటూ పేరు పెట్టి దానికి తోడు మెడికల్ స్టోర్ ఏర్పాటు చేసి సరికొత్త వ్యాపారానికి తెరలేపారు. ఇంత జరుగుతున్నా మండల వైద్యాధికారి పట్టించుకోవటం

ప్రజల ప్రాణాలతో చెలగాటం

లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఆర్ఎంపిలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయల్సి ఉండగా సూది మందు నుండి సెలెన్‌బాటిల్ వరకు అన్నీ చేస్తున్నారు. సూది మందు వేస్తే రూ.300, బాటిల్ పెటిడే రూ. 500 వరకు వసూలు చేస్తూ పేద ప్రజల జేబుకు చిల్లులు పెడుతున్నాయి. మరో వైపు పెద్ద ఆసుపత్రులతో కుమ్మక్కై తమ దగ్గరకు వచ్చే రోగులను అక్కడికి రెఫర్ చేస్తు సరికొత్త వ్యాపారానికి తెగబడుతున్నారు.

చర్యలు శూన్యం : ప్రథమ చికిత్స కేంద్రాలు అయినప్పటికి క్లీనిక్ అంటూ పెద్ద పెద్ద అక్షరాలతో బోర్డులు ఏర్పాటు చేసి తమ పేరుముందు డాక్టర్ అన్న అక్షరాలను తగిలించి అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇప్పటికైన జిల్లా వైద్యాధికారులు చొరవచూపి అనధికార క్లీనిక్ లపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

'వెన్నెల్లో గోదారి' కథా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి -పెనుకొండ

శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఆర్య వైశ్యకళ్యాణ మంటపంలో మాడుగుల సులోచనాదేవి రచించిన 'వెన్నెల్లో గోదారి' కథా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది.ఈ సందర్భంగా నేటి వర్ధమాన సమాజంలో స్త్రీల స్థితిగతులను,బడుగుబలిహీన వర్గాల వ్యథలను కథలుగా రాసి ఈ కవితా సంపుటిని సులోచనాదేవి తీసుకొచ్చారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా అన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైనకర్ణాటక తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు కళ్ళే వెంకటేశ్వర శాస్త్రి మాట్లాడుతూ ఈ కథల పుస్తకంలో నేటి ఆధునిక కాలంలో దిగజారిపోతున్న మానవీయ విలువలకు అద్దం పట్టే కథలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, పుస్తక సమీక్షకులు నిర్మలా రాణి , వై నాగరాజు, సాహితీ స్రవంతి కన్వీనర్ హరి ప్రసంగించారు. ఈ సందర్భంగా రచయిత్రి సులోచనా దేవిని జిల్లా రచయితల సంఘం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో తరిమెల అమర్ నాథ్ రెడ్డి, బాస్కర్ నాయుడు, డా.రమేష్ నారాయణ,జాన్ ప్రియనాథ్, కవులు, రచయితలు పాల్గొన్నారు.

కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ఎలాంటి రక్షణ కవచాలు లేకుండా పనిచేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి మడకశిర రూరల్

మున్సిపల్ కార్మికుల పట్ల అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని సిఐటియు నాయకులు విమర్శించారు. ఈసందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి రామాంజినేయులు ఆదివారం పట్టణంలో పారిశుద్య పనులు చేపడుతున్న కార్మికులతో మాట్లాడారు. వారు చేతికి గ్లౌజులు కాళ్లకు బూట్లు లేకుండా పనులు చేస్తుండటాన్ని గమనించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ఇరువైపుల చెత్త చెదారం కార్మికులు చేతులతో తొలగించడం బాధాకరమన్నారు. మున్సిపల్ కార్మికులకు సేఫ్టీ గా గ్లౌజులు బూట్లు పనిముట్లు ఇవ్వకుండా పనిచేయించుకోవడం అన్యాయమన్నారు. కార్మికుల సమస్యలపై కమినర్‌తో ప్రస్తావిస్తే ఆయన నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబానికి దిక్కు ఎవరని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్మికులకు న్యాయం చేసేవరకు సిఐటియు, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, నాయకులు యోగానంద, మనూరు రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

బహుమతిని అందుకుంటున్న విద్యార్థిని

ధర్మవరం టౌన్ : వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. వారం రోజులుగా గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో వివిధ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పెనుజూరినాగరాజు, కౌన్సిలర్ శివ, కరస్పాండెంట్ కాంతమ్మ, విశ్రాంత హెచ్ఎం ముత్యాలప్పు చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు కమల, ఎల్ఐసి ఏజెంటు నాగరాజు, గ్రంథాలయ సిబ్బంది శివమ్మ, నాయక్, గంగాధర్, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం ముగిసాయి. గత వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్థానిక ఎస్ఐ శ్రీనివాసులు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి మల్లికార్జున, గోగ్రీన్ బాలజీ, గంగాధర్, తంజుల్, శివ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : పుస్తక పఠనంతో మరింత జ్ఞానం సాధించవచ్చునని గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం ముగింపు వేడుకలను నిర్వహించారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లోని విజేతలకు బహుమతులను. ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో టీచర్ రేష్మ, మహబూబ్, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జెడ్పీటీసీ జయరాం నాయక్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ గుప్తా, బాబయ్య, చలపతి, పణీంద్ర, గ్రంథాలయ అధికారి రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి జయరాం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసిన దాతలను సన్మానించారు.

మడకశిర రూరల్ : పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు విద్యార్థులకు డిజిటల్ గ్రంథాలయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాయడం అమానుషం

ప్రజాశక్తి - తలుపుల

పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా రద్దు చేయడం బాధాకరమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులతో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా ఇస్తున్న సంక్షేమ పథకాలను తక్షణమే ఆపేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం బాధాకరమన్నారు. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్దరించాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షమే పథకాలు అమలు చేసే లక్ష్యంతో ఏర్పాటైన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నా కేంద్రం ఒక్క మాట కూడా మాట్లాడక పోవడం బాధాకరమన్నారు. జిల్లా వ్యాప్తంగా కార్మికులై ఐక్యమై ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్మికులకు సిఐటియు ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా మహబూబ్‌బాషా, ఉపాధ్యక్షులుగా గణేష్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనతోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మూఢనమ్మకాల నిర్మూలనతోనే సమాజాభివృద్ధి సాధ్యమని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య అన్నారు. స్థానిక పెన్షనర్ల భవనంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తరతరాల నుండి వస్తున్న ఆచారాలు సాంప్రదాయాల పేరుతో వస్తున్న వాటిని ప్రజలు వదులుకోలేక పోతున్నారన్నారు. ప్రస్తుతం ఎంత చదువుకున్నా సరైన శాస్త్రజ్ఞానం లోపించిందన్నారు. ఈ కార్యక్రమంలో కంటివైద్యనిపుణులు నరసింహులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, నాస్తికా సమాజం సత్య నిర్ధారణుడు పెన్షనర్స్ అసోషియేషన్ నాయకులు చలపతి, సాయికృప డిగ్రీకళాశాల కరస్పాండెంట్ సీతారామయ్య, జేవీవీ నాయకులు లోకేశ్, శ్రీరాములు,రామచంద్ర, లక్ష్మీనారాయణ, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో ముందుకు సాగుదాం

ప్రజాశక్తి - కదిరి టౌన్

సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

బలిజలందరూ సమిష్టి కృషితో ముందుకు సాగుదామని బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని తాయిగ్రాండ్‌లో జివిఆర్ బలిజ సామాజికవర్గం వారి వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. జివిఆర్ బలిజల వివాహ వేదిక వ్యవస్థాపకులు, మాజీ ఏఈ జీవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 45 మంది వధూవరులకు సంబంధించిన బయోడేటాను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చాలామంది పెళ్లి సంబంధాలు కుదరక మధ్యవర్తుల ద్వారా ఇబ్బందులకు గురవుతున్నారని. అలా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కందుకూరు నాగరాజు, మాజీ అధ్యక్షులు ఎన్‌వి ప్రసాద్, అధ్యక్షులు పుల్లయ్య, రమేష్ బాబు, ట్రావెల్స్ రవి, అన్నం జనార్ధన, చింతా శ్రీనివాసులు, బలిజ సామాజికవర్గం వారు తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవం జరిపించాలని వినతి

ప్రజాశక్తి -పెనుకొండ

డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కాలనీలో దళితులు, గిరిజనలు వివక్ష అంటరానితనం ఇప్పటికీ ఎదుర్కొంటున్నారని ఈ నేపథ్యంలో పౌర హక్కుల దినోత్సవం జరిపించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు పెనుకొండ డీఎస్‌పి హుస్సేన్‌పీరాకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామాలలో అగ్రవర్ణాల పెత్తనం చాలా ఎక్కువైందని అన్నారు. తహశీల్దార్, ఎంపీడీవో మిగతా ఉన్నతాధికారులు ప్రతినెల చివరి వారంలో పౌర హక్కుల దినోత్సవం జరిపించి దళితులు ,గిరిజనులు వివక్షకు గురికాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు హరి, మండల కార్యదర్శి రమేష్, తిప్పన్న, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, వజ్రం నాగప్ప, నాగరాజు, అన్నప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితులు అరెస్టు

అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సిఐ

కదిరి టౌన్ : ఈనెల 18న కదిరి పట్టణం కుటాగుల ఆటో స్టాండ్ వద్ద జరిగిన వంశీ అనే వ్యక్తి హత్య కేసు నిందితులను పట్టణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో హత్యకేసుకు సంబంధించిన వివరాలను పట్టణ సిఐ తమ్మిశెట్టి మధు వివరించారు. ఈనెల 18న కదిరి పట్టణం సైదాపురానికి చెందిన వంశీ, అతని స్నేహితులైన కుటాగులకు చెందిన చెరుకు అర్జున్, చెరుకు లోకేష్ మధ్య డబ్బు విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవ కాస్తా ఘర్షణగా మారి హత్యకు దారితీసింది. అర్జున్ తాను తీసుకొచ్చిన కత్తితో వంశీని పొడిచి పరారయ్యాడు. మృతుడి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు సిఐ మధు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు ఆదివారం కదిరి పులివెందుల రహదారి నూతన బైపాస్ రోడ్డు వద్ద హత్యకేసు నిందితులు చెరుకు అర్జున్, చెరుకు లోకేష్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న హత్యకు ఉపయోగించిన కత్తి, టాటా సుమో, రాయల్ ఎన్ఫీల్డ్ బుల్లెట్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

అర్ధరాత్రి జెసిబితో కూల్చిన ఇల్లు

కదిరిలో అర్ధరాత్రి ఇళ్లు కూల్చివేత

కదిరి టౌన్ : కదిరిలో పేదల ఇళ్లను అర్ధరాత్రి కూల్చివేశారు. ఇందుకు సంబంధించిన బాధితులు తెలిపిన వివరాలు.. కదిరి రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో ఇమామ్ సాబ్, రెడ్డప్ప గత మూడు సంవత్సరాల క్రితం స్థలం కొనుగోలు చేశారు. కష్టపడి సంపాదించిన సొమ్ముతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఇళ్లను నిర్మించుకున్నారు. అయితే వారి ఇళ్లను శనివారం అర్ధరాత్రి సమయంలో 11వ వార్డు కౌన్సిలర్ నూరుల్లా, ఇస్మాకు తమ అనుచరులతో వచ్చి జెసిబితో అర్ధరాత్రి కూల్చి వేశారు. తమ ఇళ్లను దౌర్జన్యంగా అర్ధరాత్రి కూల్చివేయడంతో బాధితులు ఆదివారం కదిరి రాయచోటి రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ అధికార పార్టీ అండదండలతో కదిరిలో దౌర్జన్యాలు ఆక్రమణలు అధికమయ్యాయన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం ప్రైవేటు వ్యక్తుల ద్వారా కొనుగోలు చేసిన స్థలానికి వైసిపి నాయకుడు, మరో వ్యక్తి కలసి తమను డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. సెంటు స్థలానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని అందుకు అంగీకరించకపోవటంతో రాత్రిపూల జెసిబితో తమ ఇళ్లను కూల్చి వేశారని వాపోయారు. అధికారులు తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో డీఎస్పీకార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

మృతుని కుటుంబానికి పరామర్శ

కనగానపల్లి : అనారోగ్యంతో మృతిచెందిన మద్దలచెరువు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త హనుమంత్ రెడ్డి కుటుంబాన్ని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పరిటాల శ్రీరామ్ ఆదివారం పరామర్శించారు. ఈసందర్భంగా మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మండలకన్వీనర్ యాతం పోతలయ్య, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి భానుగోట నరసింహులు, సీనియర్ నాయకులు సుధాకర్ చౌదరి, జగదీష్, తగరకుంట రామాంజి, మాధవరాజు, తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరచిన నాట్యప్రదర్శన

చిన్నారుల నాట్య ప్రదర్శన

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో పార్వతుల కల్యాణోత్సవం సందర్భంగా శ్రీలలితా నాట్యకళానికేతన్ బృందం చేసిన నాట్యప్రదర్శన అబ్బురపరిచింది. కళానికేతన్ గురువులు బాబూబాలాజీ, కమలాబాలాజీ శిష్యబృందం చేసిన నాట్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీసభ్యులు నాట్యకళాకారులను అభినందించారు.

ధర్మవరం నుండి పుట్టపర్తికి ప్రత్యేక బస్సులు

ధర్మవరం టౌన్ : శ్రీసత్యసాయిబాబా జయంతి వేడుకల సందర్భంగా ఈనెల 22, 23 తేదీలలో ధర్మవరం నుండిపుట్టపర్తికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని ఆర్టీసీ డిఎం మోతిలాలానాయక్ తెలిపారు. ఈమేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధర్మవరం రైల్వేస్టేషన్ నుండి పుట్టపర్తికి ఈ రెండు రోజులలో అరగంటకు ఒకటి ప్రత్యేక బస్సులను నడుపుతామని చెప్పారు.

పేద రెడ్డి విద్యార్థుల అభివృద్ధే జెఎసి లక్ష్యం

ధర్మవరం టౌన్ : రెడ్ల ఆర్థిక అభివృద్ధి, ఐక్యతతో పాటు ప్రతిభగల ప్రతి పేద రెడ్డి విద్యార్థులకు విద్య ఉద్యోగ రూపకల్పనే రెడ్డి జేఏసీ ప్రధాన లక్ష్యమని రెడ్డి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామాటం శేషాద్రి రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక రెడ్డి సంఘం కార్యాలయంలో రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిభగల ప్రతి పేద రెడ్డి విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అందుకోసం 175 నియోజకవర్గాలలో రెడ్డి జేఏసీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జేఏసీ నాయకులు కోళ్ల మొరం కేశవరెడ్డి సంపత్ రెడ్డి, మాధవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పెద్దిరెడ్డి, అశోక్ రెడ్డి, గోవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

హిందూపురం : అయప్ప మాలాధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమనిఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. స్థానిక బెంగళూరు రోడ్డులో గల అయ్యప్ప దేవస్థానంలో ఆదివారం ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రమేష్, ఆయూబ్, వైసిపి నాయకులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల సంఘం సభ్యులుగా భవాని శంకర్‌రెడ్డి, రంజిత్ నాయక్



సభ్యత్వ కార్డులు అందుకుంటున్న దృశ్యం

పెనుకొండ : మానవహక్కుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పెనుకొండకు చెందిన భవాని శంకర్‌నాయక్, రంజిత్‌నాయక్ చేరారు. ఈమేరకు వారు డాక్టర్ భాస్కర్‌నాయుడు చేతుల మీదుగా సభ్యత్వం కార్డులను అందుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మానవ హక్కులను పరిరక్షించడానికి, సంస్కృతి, సాంప్రదాయాలను తమ వంతు బాధ్యతగా పెనుకొండ పరిసర ప్రాంతాలలో రక్షించుకోవడానికి ఈ బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. పకృతిని నాశనం చేస్తే తాము ప్రశ్నించి తీరుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్మెంట్ సంస్థ సభ్యులతో పాటు నేషనల్ లీగల్ అడ్వైజర్ రవిశంకర్ గురూజీ, ఎస్కేయూ తెలుగు ప్రొఫెసర్ బాలు, ప్రముఖ కవి రమేష్ నారాయణ, హ్యూమన్ రైస్ సంస్థ సభ్యులు హరిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.